ఆదర్శనగర్‌లోని ఓ గల్లీలో..


గాంధీనగర్‌లోని వీధి నెంబరు-7లో..


గణేష్‌నగర్ రోడ్డు నెంబరు-23లో..


గిరినగర్‌లో రోడ్డు దుస్థితి


గురుమూర్తినగర్- గిరినగర్ ప్రధాన రోడ్డు


ఏడాదిగా పాపిరెడ్డినగర్ రోడ్డు


తవ్వారు.. వదిలేశారు

పునర్ నిర్మించడంలో బాధ్యత మరిచారు!

రంగారెడ్డినగర్: అభివృద్ధి పనుల పేరుతో తవ్విన రోడ్ల పునర్‌నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసినా సంబంధిత అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల నిమిత్తం జలమండలి ఆధ్వర్యంలో రోడ్ల తవ్వకాలు చేపట్టి పూర్తి చేశారు. అయితే సదరు పనులు పూర్తయి నెలలు, సంవత్సరాలు కావస్తున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం వాటిని పునరుద్ధరించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయగా.. మరి కొన్ని ప్రాంతాల్లో ప్రతిపాదనలు చేయకపోవడం గమనార్హం. డ్రెయిన్‌ల నిర్మాణ విషయంలో సైతం అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. వేసవిలో పూర్తి చేయాల్సిన వాటిని వర్షాలు ప్రారంభమైన సమయంలో చేపట్టడంతో రోడ్లు బురదమయంగా మారే అవకాశముంది.

ఇరు శాఖల మధ్య సమన్వయం లోపించడంతోనే..

గతంలో భూగర్భ డ్రైనేజీ లైన్లు, వాటర్ డ్రెయిన్‌ల నిర్మాణ పనులు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. రెండు సంవత్సరాలుగా సదరు పనులను జలమండలికి బదలాయించారు. అప్పటి నుంచి ఏదైనా ప్రాంతంలో డ్రైనేజీ లైన్ కోసం రోడ్డు తవ్వి పనులు పూర్తి చేసినా నెలలు తరబడి శిథిలమైన రోడ్లే దర్శనమిస్తున్నాయి. పనులు చేపట్టే సమయంలో జలమండలి అధికారులు జీహెచ్‌ఎంసీ అధికారుల నుంచి లిఖిత పూర్వకంగా అనుమతులు తీసుకున్న పిమ్మటే వాటిని ప్రారంభించి పూర్తి చేస్తున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో ధ్వంసమైన రోడ్ల నిర్మాణ పనులు మాత్రం జీహెచ్‌ఎంసీ చేపట్టాల్సి ఉంటుంది. ముందుగానే పనులు జరిగే ప్రాంతాల సమాచారం జీహెచ్‌ఎంసీ అధికారుల వద్ద ఉంటున్నా ముందస్తుగా ప్రతిపాదనాలు సిద్ధం చేసి రోడ్లను నిర్మించడంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నారు.

వర్షాలు ప్రారంభమైతే ఇక అంతే..

జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏదైనా ప్రాంతంలో రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వస్తే వర్షాకాలానికి ముందే సదరు పనులు పూర్తి చేస్తుంటారు. కాగా గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో 8 నెలల క్రితం డ్రైనేజీ లైన్ల నిర్మాణం కోసం తవ్వి పూర్తి చేసిన ప్రాంతాల్లో ఇంకా రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదు. ఈ విషయమై పలుమార్లు స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు అందజేసిన సదరు పనులకు మోక్షం కలుగడం లేదు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మరో మూడు నెలల పాటు పనులు చేపట్టే అవకాశముండదు. దీంతో మరో నాలుగు నెలల పాటు రోడ్ల పనుల కోసం ఎదురు చూడాల్సిందే.

ఛిద్రమైన రోడ్లపైనే రాకపోకలు..

రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లోని పలు రోడ్లలో అభివృద్ధి పనుల కోసం తవ్విన రోడ్లను సంవత్సర కాలంగా పునరుద్ధరించ లేదు. దీంతో మట్టి రోడ్లపైనే స్థానికులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గిరినగర్, గురుమూర్తినగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పైకి రావడంతో కార్లు, ఆటోలు వంటి వాహనాలు వచ్చేందుకు వీలు లేకుండా పోతోంది. ఇక జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్‌పురి కాలనీ, పాపయ్యయాదవ్ నగర్‌లలో పలు గల్లీలు మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. గాజులరామారం డివిజన్ ఇందిరనగర్‌నగర్‌లో భూగర్భడైనేజీ పేరిట తవ్విన రోడ్డును పునరుద్ధరించకపోవడంతో వర్షం పడితే రోడ్డంగా మడుగులా మారుతోంది.

వేసవిలో పూర్తి చేయాల్సిన డ్రెయిన్‌లు ఇప్పుడే..

వర్షాకాలంలో వరదనీరు సాఫీగా వెళ్లేందుకు, అదే విధంగా వరదనీరు నిల్వ ఉండకుండా చేపట్టే వాటర్ డ్రెయిన్‌ల పనులను మార్చి, మే నెల్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. కాగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని గణేష్ నగర్‌లో ఇటీవల వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రారంభించి పూర్తి చేశారు. అయితే డ్రెయిన్ పైపులు వేసేందుకు రోడ్డును తవ్వడంలో మట్టి రోడ్డును తలపిస్తోంది. ఇక వానలు పూర్తి స్థాయిలో ప్రారంభమైతే రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయని స్థానికులు వాపోతున్నారు.


గాజులరామారం డివిజన్ ఇందిరనగర్ రోడ్డు


సంజయ్‌పురికాలనీలో అధ్వానంగా రోడ్డు


నందానగర్ ఎంపీపీ స్కూల్ ఎదురుగా ఇలా..


సౌభాగ్యనగర్‌లోని ఓ రోడ్డు దుస్థితి ఇది

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: హెచ్ఎండీఏ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీహోమ్స్‌కాలనీ, బృందావన్ కాలనీ, కెన్నడీ స్కూల్ వెనుక గల్లీ, అదే విధంగా 11 కేవీ మావిల్లాస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంటల నుంచి 3.30 గంట వరకు కేఆర్‌సీఆర్‌కాలనీ, మమత ఆస్పత్రి, బొల్లారం ఇండస్ట్రీ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి


స్థానికులతో మాట్లాడుతున్న చెరుకుపల్లి భరతసింహారెడ్డి

లిబర్టీ: ఆటో డ్రైవర్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అఖిలభారత అసంఘటిత కార్మిక, ఉద్యోగుల సంఘం ఆటో విభాగం రాష్ట్ర శాఖ విజ్ఞప్తి చేసింది. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక మల్లేష్ సారథ్యంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ. 12 వేలు వెంటనే చెల్లించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ. 12 వేలు చెల్లిస్తామని ఎన్నికల ప్రణాళికలు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఉపాధి లేక ఆటోలు అద్దెకి తీసుకోని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు బ్యాంకు ప్రధాన రుణాలు ఇప్పించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వాలని ప్రభుత్వం సంక్షేమ పథకాలను మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారుల నుంచి వేధింపులు ఆపాలని విన్నవించారు. స్పందించిన మంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 12 వేలు చెల్లిస్తామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు ప్రతీ విద్యార్థి నేర్చుకోవాల్సిన 50కి పైగా లేటెస్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరినిన వివరాలకు సెల్ నంబర్ 9505800050లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రినగర్‌లో రోడ్డు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోయారు. ఇదే విషయాన్ని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమెర్‌సింగ్, సంజీవరెడ్డి, శర్మ, బ్రిజేష్ జా, జగ్గా, సుధీర్, రజినీకాంత్, మధు, రాజేశ్వర్ రావు, రమేష్, రాకేష్, సతీష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

గురువులను స్మరించుకోవడం గొప్ప సంస్కారం

చిక్కడపల్లి: గురువులను స్మరించుకోవడం గొప్ప సంస్కారమని ఎమ్మెల్సీ సురభీవాణీదేవి అన్నారు. భారత చూడామని ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ప్రముఖ నాట్యగురువు సువర్ణలత గురువులు కె.లక్ష్మణ్, జగన్నాథశర్మ సంస్మరణ సభను సోమవారం రాత్రి నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సువర్ణలత ఐదు దశాబ్దాలకు పైగా కూచిపూడి నాట్యంలో వందలమందికి శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో సాహితీ, లక్ష్మీదినేష్, శ్రీవల్లిశర్మ పాల్గొన్నారు.

మంజీరా పైపులైన్‌తో పాటు సీసీ రోడ్డును నిర్మించాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న పేట్‌బషీరాబాద్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: తమ బస్తీలో నూతనంగా మంజీరా పైపులైన్‌తో పాటు సీసీ రోడ్డును నిర్మించాలని పేట్‌బషీరాబాద్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తమ బస్తీలో గతంలో మంజీరా పాత పైపులైన్లు ఉండేవని, ఇటీవల వేసిన డ్రైనేజీ పైపుల కారణంగా పైపులైన్లను జేసీబీతో పూర్తిగా తొలగించారని అన్నారు. ప్రస్తుతం మంజీరా నీళ్ల వచ్చే క్రమంలో నీరంతా రోడ్డుపై పారి బురదమయంగా మారుతుందన్నారు. బస్తీలో కొత్తగా మంజీరా పైపులైన్‌తో పాటు సిసి రోడ్డును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ సానుకూలంగా స్పందించినట్లు సంక్షేమ సభ్యులు తెలిపారు. పులి మహేశ్‌బాబు గౌడ్, పులి చంద్రంగౌడ్, పులి బాల్‌రాజ్‌గౌడ్, యాదగిరిగౌడ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సముచిత స్థానం

దుండిగల్: కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం కల్పిస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్, భువనగిరి ఎంపీలుగా గెలుపొందిన డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డిని వేర్వేరుగా కలిశారు. వారికి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.



ఎంఎల్ఆర్ఐటీలో రక్తదానం



దుండిగల్: ఎంఎల్ఆర్ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 200 మంది చిన్న పిల్లలకు భోజన ప్యాకెట్లను అందజేశారు. అదే విధంగా ఎంఎల్ఆర్ఐటీ 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ రావు, అరుంధతి ఆస్పత్రి డీన్ డాక్టర్ ఉదయ్‌కుమార్, బాలాజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్‌గౌడ్, వలంటీర్లు ప్రశాంత్, ఆర్యన్, నరేష్, లికిత తదితరులు పాల్గొన్నారు.

'నీట్' అవకతవకల ఆరోపణలపై ప్రధాని స్పందించాలి

బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్



కుత్బుల్లాపూర్: ఇటీవల నిర్వహించిన నీట్ ఎంట్రన్స్‌లో అవకతవకల ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ కోరారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షా పేపర్ లీకై న అంశంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. తమ పిల్లలు డాక్టర్లు అవుతారని కలలుగన్న తల్లిదండ్రుల ఆశయాలను గందరగోళానికి గురి చేశారన్నారు. బిహార్ రాష్ట్రంలో రూ.30లక్షలకు నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారని, అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికీ కేంద్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి..

ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే స్పందించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నీట్ పరీక్షలో గతంలో ఎప్పుడు లేని విధంగా ఒకే ర్యాంకు 67 మందికి ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఒకే గదిలో 720కి 720 మార్కులు 8 మందికి ఎలా వస్తాయనే ప్రశ్న ఉత్పన్నమవుతుందని పేర్కొన్నారు. ఈ మార్కులు సాధించడం చూస్తే పేపర్ ఏ విధంగా లీక్ అయిందో అందరికీ అర్థం అవుతుందని అన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ దశరథం, రాష్ట్ర కార్యదర్శి రాజేష్, వివిధ జిల్లాల అధ్యక్షులు అశోక్, నరేష్, రంగు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బండరాళ్లు పేలుస్తున్నారని పనులు నిలిపివేత

- ఓ రోజు ఆగి బండరాళ్లను కొట్టిస్తున్న వైనం
- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్న ఆర్ రేణుక


సర్వే నం.79లో బండలు కొడుతున్న దృశ్యం

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాన్ని తన స్థలంగా పేర్కొంటూ ఎలాంటి అనుమతులు లేకుండా గతంలో బండరాళ్లను పేల్చి వేసిన వ్యక్తి తిరిగి రాళ్లను కొట్టిస్తున్నాడు. గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీలో సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఓ వ్యక్తి సర్వే నంబర్ 219 పేరుతో పక్కనే సర్వే నం.79లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు సన్నాహాలు ప్రారంభించాడు. అందులో బండరాళ్లు ఉండడంతో ఈ నెల 15న బాంబులతో పేల్చడంతో స్థానికంగా భారీ శబ్దంతో ఉలికి పడ్డారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక సదరు స్థలం ప్రభుతానికి చెందని పేర్కొంటూ పనులను నిలిపివేశారు. తాజాగా సదరు వ్యక్తి సోమవారం బండరాళ్లను కొట్టిస్తూ పని చేయించాడు. ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుకను వివరణ కోరగా సదరు వ్యక్తిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, అతనిపై కేసు కూడా నమోదు చేస్తామన్నారు.

'పనులు కాకముందే కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎలా చెల్లిస్తారు?'


ఎస్ఎన్‌డీపీ నాలాను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి కాకముందే కాంట్రాక్టర్‌కు నిధులు ఎలా చెల్లిస్తారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ముదిరాజ్ అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని పాపయ్యకుంట నుండి సిరిబాలాజీ లేఅవుట్ వరకు రూ.2.1 కోట్ల నిధులతో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులను బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 9 చోట ఎస్ఎన్‌డీపీ పనులను రూ. 84 కోట్లతో చేపట్టినా ఇంత వరకు ఐదు ప్రాంతాల్లోనే పూర్తి చేసి మరో నాలుగు చోట్ల పెండింగ్ పెట్టారన్నారు. సదరు కాంట్రాక్టర్ స్థానిక ఎమ్మెల్యే సమీప వ్యక్తి కావడంతో పనులు పూర్తి చేయకున్నా అధికారులు రూ.30 కోట్ల బిల్లులు చెల్లించారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బాచుపల్లి కౌసల్య కాలనీ వద్ద నాసిరకం పనులు చేపట్టారని, రిటైనింగ్ వాల్‌ను భూమికి సమాంతరంగా నిర్మించలేదని, అదే విధంగా పెద్ద చెరువు వద్ద ఎస్ఎన్‌డీపీ నాలాకు కనీసం కనెక్టివిటీ ఇవ్వకుండా పనులు ఏ చేస్తున్నారని ఆరోపించారు. ఈ పనులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. నాయకులు కృష్ణ, శేషారావు, ప్రవీణ్, రాజేష్, ఆదిత్య, శ్రీధర్, రామకృష్ణ, నారాయణమూర్తి, ప్రహ్లాద్, ఉదయ్, శివ, సుధాకర్‌రెడ్డిలు ఉన్నారు.


కూన శ్రీశైలంగౌడ్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు


శ్రీశైలంగౌడ్‌తో కేక్ కట్ చేయిస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

ఘనంగా కూన శ్రీశైలంగౌడ్ జన్మదిన వేడుకలు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు చేరుకుని శ్రీశైలంగౌడ్‌తో కేక్‌ల్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా అభిమానులు ఆయనను గజమాలతో సత్కరించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనాథ ఆశ్రమాల్లో చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు జరిపారు. - కుత్బుల్లాపూర్



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి, కొలన్ హన్మంతరెడ్డి


రాఘవేంద్రగౌడ్, రాముగౌడ్‌ల ఆధ్వర్యంలో అనాథాశ్రమంలో వేడుకలు


చిత్తారమ్మ ఆలయంలో శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వివేకానంద్



త్యాగానికి ప్రతీక బక్రీద్

కుత్బుల్లాపూర్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని సోమవారం నియోజకవర్గ పరిధిలోని ముస్లిం పెద్దలు పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మాట్లాడుతూ.. త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందన్నారు. ఈ పండుగ సందర్భంగా పేదవారికి సహాయం చేయడం అభినందనీయమన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 21వ డివిజన్ పరిధిలోని న్యూ ఈద్గాలో సోమవారం ముస్లింలు ఈద్-ఉల్-ఆధా ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో శ్రీసాయినగర్, రాజీవ్‌గృహకల్ప, ప్రగతినగర్, నిజాంపేట్ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యల్లో ముస్లింలు పాల్గొన్నారు. ఈ ప్రార్థనల్లో ముస్లిం పెద్దలు, నాయకులు ఖలీల్‌ఉల్లా ఖాన్, ఎండీ జహంగీర్, నబీ, సయ్యద్ షకీల్, మోయిన్, ఎండీ సలీం, ఎండీ అంజాద్, దర్గా అలీ, ఎండీ ఖలీల్, ఎండి హబీబ్ తదితరులు పాల్గొన్నారు


బాచుపల్లిలోని ఈద్గాలో జరిగిన ప్రార్థనలో ముస్లింలు